ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 07.10.2024 మధ్యాహ్నం 1-10 గంటలు

ముఖ్యాంశాలు

1. ఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో ప్రారంభమైన మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల ముఖ్యమంత్రుల సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు.

2. ప్రభుత్వరంగ సంస్థలను బలోపేతం చేయాల్సిన బాధ్యత అందరి పై ఉందని సింగరేణి బొగ్గుగని కార్మికులకు బోనస్ పంపిణీ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కోరారు.

3. రాష్ట్రంలో రుణ మాఫీ ప్రక్రియ పూర్తవగానే రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమ చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు

4. తెలంగాణలో మరో రెండు రోజుల పాటు తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

**DELHI CM- LEFT WING EXTREMISM**

కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల ముఖ్యమంత్రుల సదస్సు దిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ప్రారంభమైంది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా నేతృత్వంలో ఈ సమావేశం జరుగుతోంది. ఈ భేటీకి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , ఆంధ్రప్రదేశ్ నుంచి ఆ రాష్ట్ర హోంమంత్రి అనిత హాజరయ్యారు. తెలుగు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు , డీజీపీలు పాల్గొన్నారు. ఈ భేటీకి మహారాష్ట్ర , మధ్యప్రదేశ్, బిహార్, ఒడిశా, ఝార్ఖండ్, కేరళ, పశ్చిమ్ బెంగాల్, ఉత్తర ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ప్రతినిధులు హాజరయ్యారు. మావోయిస్టు ప్రభావిత

రాష్ట్రాల్లో భద్రతపై అమిత్‌షా సమీక్షిస్తున్నారు. 2026 నాటికి దేశవ్యాప్తంగా వామపక్ష తీవ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించడంపై ఆయా రాష్ట్రాల ప్రతినిధులతో సమాలోచనలు చేస్తున్నారు.

NSD

**SINGARENI - BHATTI**

ప్రభుత్వరంగ సంస్థలను బలోపేతం చేయాల్సిన బాధ్యత అందరి పై ఉందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. సింగరేణి బొగ్గుగని కార్మికుల వార్షిక బోనస్ చెక్కుల పంపిణీ సందర్భంగా ఆయన మాట్లాడారు. సింగరేణి సంస్థ లాభాలలో కార్మికుల వాటా పెంచేందుకు ప్రభుత్వం యోచిస్తోందని పేర్కొన్నారు. సంస్థ లాభాల విషయం గత ప్రభుత్వాల మాదిరి వాస్తవాలు దాచిపెట్టలేదని చెప్పారు. గనులనుంచి బొగ్గు తీసే ఖర్చును తగ్గించేల కార్మికులు కృషి చేసి, లాభాలలో వాటాను పెంచుకోవాలని సూచించారు. మారుతున్న కాలంతో పాటూ సాంకేతిక పరిజ్ఞానాన్ని మెరుగుపరుచుకోవాలని సూచించారు. సింగరేణి బావుల వద్ద కార్మికుల కోసం దసరా పండుగ లోగా విందు ఏర్పాటు చేసి భవిష్యత్ ప్రణాళికలను రూపొందించాలని ఉపముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. చెప్పారు.

(MSL)

**DY CM - SINGARENI**

అంతకుముందు ప్రజా భవన్ లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సింగరేణి బొగ్గుగని కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం దసరా బోనస్ చెక్కులను పంపిణీ చేసింది. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క , మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , శ్రీధర్ బాబు కార్మికులకు చెక్కులను అందచేశారు. 2023-24 సంవత్సరానికి సింగరేణికి 2 ,412 కోట్ల రూపాయల లాభాలు వచ్చాయని ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు.

**SRIDHAR BABU**

ప్రభుత్వ శాఖల్లో ఏర్పడిన ఉద్యోగ ఖాళీలను పారదర్శకంగా భర్తీ చేస్తామని ఐటి , పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. ప్రజా భవన్ లో జరిగిన సింగరేణి కార్మికులకు చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ఈ మేరకు ప్రకటన చేశారు. చెన్నూరు, రామగుండంలో నైపుణ్య కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆ ప్రాంతంలో 1800కు పైగా ఉద్యోగ నియామకాలు చేపడుతున్నామని వెల్లడించారు. కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహించి నియామకాల్లో పూర్తి స్థాయి పారదర్శకతను పాటిస్తామని తెలిపారు.

**GANDHIBHAVAN**

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యాలయం గాంధీ భవన్ లో రాష్ట్ర మంత్రులతో ముఖాముఖి కార్యక్రమంలో భాగంగా ఈరోజు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరారవు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుండి వినతులు స్వీకరించారు. తక్షణం పరిష్కరించాల్సిన అంశాలపై సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు. ఒక వృద్ద మహిళ యాదమ్మ నేరేడుచర్ల మండలానికి సంబంధించి భూమి విషయంపై ఫిర్యాదు చేయగా , సూర్యాపేట కలెక్టర్ తో మంత్రి తుమ్మల ఫోన్ లో మాట్లాడి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు.

(ఎడిటర్)

**TIRUMALA**

కలియుగ దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఈరోజు ఉదయం కల్పవృక్ష వాహన సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారు తిరుమల మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. కల్పవృక్ష వాహనంపై శ్రీవారి వైభవాన్ని తిలకించి భక్తులు పులకించిపోయారు. ఇవాళ రాత్రి స్వామి వారికి సర్వభూపాల వాహనసేవ జరగనుంది.

## LOANS

రాష్ట్రంలో ఇప్పటికే 18 వేల కోట్ల రూపాయల రుణ మాఫీ జరిగిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈరోజు కాంగ్రెస్ కార్యాలయం గాంధీ భవన్ లో మీడియాతో మాట్లాడారు. రుణ మాఫీ ప్రక్రియ పూర్తవగానే రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమ చేస్తామన్నారు. ప్రభుత్వంపై వ్యతిరేకత అనేది ప్రతిపక్షాల ప్రచారం మాత్రమేనని అన్నారు. బీజేపీ పాలిత ప్రాంతాల్లో కూడా ఇంత మొత్తంలో రైతు రుణ మాఫీ పథకం అమలైన దాఖలాలు లేవన్నారు.

## RAINS

తెలంగాణలో మరో రెండు రోజుల పాటు తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. నిన్న రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో వర్షం కురిసిందని తెలియచేసింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా లో అత్యధికంగా 4.45 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని పేర్కొంది. ఇదిలా ఉండగా , ఈ నెలలో అరేబియా సముద్రం , బంగాళాఖాతంలో తుఫాన్లు ఏర్పడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. దీంతో ఈ నెల 10వ తేదీ తర్వాత ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది.

(ప్రెస్ నోట్)

## TELANGANA- BHARATIYA KALA MAHOTSAV

సికింద్రాబాద్ - బోలారంలోని రాష్ట్రపతి నిలయంలో జరిగిన భారతీయ కళా మహోత్సవ్ , లక్ష మందికి పైగా సందర్శకులను ఆకర్షించింది . వారికి ఈశాన్య భారతదేశంలోని శక్తివంతమైన సంస్కృతికి ఒక సంగ్రహావలోకనం అందించింది. రాష్ట్రపతి భవన్ , ఈశాన్య ప్రాంత అభివృద్ధి మంత్రిత్వ శాఖ, సాంస్కృతిక మంత్రిత్వ శాఖ సంయుక్తంగా నిర్వహించిన 8 రోజుల ఉత్సవంలో ఎనిమిది ఈశాన్య రాష్ట్రాల నుండి 300 మందికి పైగా కళాకారులు, కళాకారులు పాల్గొన్నారు.

NSD

**BHADRADRI KOTHAGUDEM**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దివ్యాంగుల సహాయ ఉపకరణాల కొరకు భారత కృత్రిమ కాళ్ల తయారీ సంస్థ సహకారంతో రేపటి నుంచి నాలుగు రోజుల పాటు శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. ఈనెల 8న గుండాల మండల పరిషత్ కార్యాలయం , 9న ఆశ్వరావుపేట మండల పరిషత్ కార్యాలయం , 10న భద్రాచలం మండల పరిషత్ కార్యాలయం, 11న పాల్వంచ ఐడిఓసి కార్యాలయం నందు బ్యాటరీ ట్రైసైకిల్స్, ట్రైసైకిల్స్, వీల్ చైర్స్ , వినికిడి యంత్రాలు , అంధుల చేతికర్రలు , కృత్రిమ అవయవాలు , చంకకర్రలు కొరకు ఎంపిక శిబిరాలు నిర్వహించా రు. ఇతర వివరాల కొరకు 6301981960, 8331006010, 8096697365 నెంబర్లను సంప్రదించాలని కలెక్టర్ కోరారు.

**పిటిసి, భద్రాద్రి కొత్తగూడెం**

**సిరిసిల్ల**

తెలంగాణ సంస్కృతి సాంప్రదాయానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలు రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో ఘనంగా కొనసాగుతున్నాయి. జిల్లాలోని సిరిసిల్ల , ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, ఇల్లంతకుంట వీర్నపల్లి , ముస్తాబాద్, కోనరావుపేట, చందుర్తి, బోయినపల్లి మండలాల్లో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు.

(పిటీసీ)

**CHAIRMEN'S**

తెలంగాణలో పలు జిల్లాల గ్రంథాలయ సంస్థలకు ఛైర్మన్లను నియమిస్తూ ప్రభుత్వం నిన్న ఉత్తర్వులు జారీ చేసింది. గద్వాల గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గా ఎన్. శ్రీనివాసులు, మహబూబ్ నగర్ కు మల్లు నర్సింహారెడ్డి , వికారాబాద్ కు శేరి రాజేశ్ రెడ్డి , నారాయణపేట్ కు వరాల విజయ్, కామారెడ్డికి మద్ది చంద్రకాంత్ రెడ్డి , సంగారెడ్డికి జి. అంజయ్య , వనపర్తికి జి. గోవర్ధన్,

నిర్మల్ కు సయ్యద్ అర్జుమాండ్ అలీ  ,  సిరిసిల్ల గ్రంథాలయ సంస్థకు ఛైర్మన్ గా నాగుల సత్యనారాయణను నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

(పిటీసీలు)

**బండి సంజయ్**

కరీంనగర్ లోని శ్రీ మహా శక్తి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్  మహాశక్తి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.
(పిటీసీ)

**ASIFABAD – SPORTS**

గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను  ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే తెలిపారు. నవంబర్ లో నిర్వహించనున్న సీఎం కప్ ర్యాలీ జిల్లా కేంద్రానికి చేరుకున్న సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. మంచి క్రీడాకారులను తయారు చేసి ప్రపంచ పటంలో తెలంగాణను నిలపాలనే ముఖ్యమంత్రి ఆశయం మేరకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.
(పిటీసీ)